

# తెగిపోయిన గాలిపటాలు

టి.ఎస్.వి. కృష్ణమూర్తి

**పెద్ద కథ ప్రారంభం !**

**ము**ప్పయిఅయిదు రోజులపాటు యాత్రా సర్వీసుకు వెళ్ళనున్న అశోక్ లేలాండు బస్సును స్వయంగా నాలుగుమైళ్ళ దూరం నడిపించి ట్రయల్ చూసి తీసుకువచ్చి కంపెనీ ఆవరణలో ఆపి క్రిందకు దిగాను. చుట్టూ నాలుగైదు బస్సులు రిపేరి చెయ్యబడుతూ వుండడంవలన ఆవరణ అంతా గడబిడగా వుంది.

అసిస్టెంటు ఫోర్‌మెన్ నా దగ్గరగా వచ్చాడు స్పేరుపార్టుల ఇండెంటు తీసుకుని. యథాలాపంగా ఇండెంటును ఓ పర్యాయం చూసి సంతకం పెడ్తూ అన్నాను,

"మనవద్ద స్టాకులో లేని స్పేరుపార్టుల లిస్టు తయారు చెయ్యమని స్టోరు అసిస్టెంటుకు చెప్పండి."

అసిస్టెంటు ఫోర్‌మెన్ తల ఊపి విష్‌చేసి వెళ్ళిపోయాడు.

"రాంసింగ్ ! సాయంకాలము ఐదుగంటలకు ఈ బండికి వెళ్ళాల్సిన డ్రయివరును సిద్ధంగా వుండమని చెప్పండి. సర్టిఫికెట్లన్నీ సిద్ధం చెయ్యండి. వెహికల్ ఈజ్ పర్‌ఫెక్ట్ అండ్ క్వయిట్. ఓ. కే!"

అని నా అసిస్టెంటుకు చెపుతూండగా ఆఫీసు బాయ్ వచ్చాడు నా దగ్గరకు.

"సార్! మిమ్మల్నెవరో ఫోనులో పిలుస్తున్నారు" అన్నాడు.

చుట్టూ ఒక పర్యాయం పరికించి చూసి ఆఫీసుకేసి వడివడిగా నడిచాను. నా గదిలోకి వెళ్ళి సీట్లో కూర్చుని బల్లమీద టెలిఫోను ప్రక్కగా తీసిపెట్టివున్న రిసీవరు అందుకుని,

"ట్రాన్స్‌పోర్ట్ మేనేజరు స్పీకింగ్ హియర్" అన్నాను హుందాగా.

"శేఖర్! నేను ... సుజాతని మాట్లాడుతున్నాను" అని వినిపించింది అవతలనుండి.

"ఓ సుజాతగారా .. ఏమిటండీ విశేషం ... బావున్నారా ?"

అంటూ, ఓరగా చూస్తున్న స్టెనో హెలెన్‌ను గమనించి కొద్దిగా నవ్వుకున్నాను.

"బావున్నాను. నీవు ఒకసారి యింటికి రావాలి. నీతో చాల విషయాలు మాట్లాడాలి" అంది సుజాత.

చేతిగడియారం చూసుకున్నాను. సాయంకాలము మూడుగంటలు కావస్తోంది.

"సాయంకాలము ఆరుగంటల తరువాత వస్తానండీ ... ఏమిటి విశేషం ?" అని అడిగాను.

"చాల మాట్లాడాలి. ఆరుగంటల తరువాత ఒద్దు. ఎలాగైనా వీలు చేసుకుని ఐదు గంటలకే వచ్చెయ్యి. చాల ముఖ్య విషయం .. ఫోనుమీద చెప్పేది మాత్రం కాదు."

ఆశ్చర్యపోయాను నేను. ఆరుగంటల తరువాత ఐతే మధుమూర్తి కూడా ఇంట్లోనే ఉంటాడు. కానీ సుజాత ఐదు గంటలకే రమ్మంటూ ఉంది. అంటే ఏదో విశేషమే ఉండాలి అనుకున్నాను.

"అలాగే వస్తానండీ...తప్పకుండా వస్తాను" అన్నాను.

"ఎదురు చూస్తుంటాను" అంటూ అవతల ఫోన్ పెట్టేసింది ఆమె.

ఆలోచిస్తూ ఫోన్ పెట్టేసి ఫోర్‌మెన్ పంపిన రిపోర్టు తాలూకు ఫైలు ముందుకు లాక్కున్నాను.

హెలెన్ చిన్నగా ఓ పొడిదగ్గు దగ్గింది.

'ఆడవాళ్ళకు అర్థంలేని క్యూరియాసిటీ ఎక్కువ' అనుకుంటూ, హెలెన్ వైపు ఓ సారి సీరియస్‌గా చూసి నా పనిలో నేను మునిగిపోయాను.

* * *

సాయంకాలము నాలుగు గంటలా, ఏభయి ఐదు నిముషాలు అయింది కోటుతొడుక్కుంటూ ఆఫీసులోంచీ కంపెనీ ఆవరణలోకి వచ్చాను. ఆఫీస్ బోయ్ నా మోటారు సైకిలును షెడ్‌లోంచీ తీసుకువచ్చి నా దగ్గరగా స్టాండువేసి నిలబెట్టి షేవ్ క్లాత్‌తో హేండిలూ, పెట్రోలు ట్యాంకు, సీటూ తుడిచి ప్రక్కకు జరిగాడు.

జావాను ముందుకు త్రోసి స్టాండు రిలీజ్ చేసి సీటు మీద కూర్చున్నాను.

నేను వాడుకోవడం కోసం కంపెనీవారు నాకు ఓ అంబాసిడర్ కారును ఇచ్చారు. కానీ పెట్రోలు

మంటల కన్నా ఎక్కువగా మండిపోతున్న పెట్రోలు ధరలను చూసి ఎక్కువగా నా స్వంత మోటారు సైకిలునే వాడుతున్నాను ఈ మధ్య మరీ ముఖ్యమైన అవసరం అయితే తప్ప కారు వెలుపలికి తీయడం లేదు

ఒకేఒక కిక్కుతో స్టార్టు అయిన జావా మోటారు సైకిలు టపటపా శబ్దం చేసుకుంటూ విజయభారత్ ట్రాన్స్‌పోర్ట్సు కంపెనీ నుండి వెలుపల పడి ఏభయి కిలోమీటర్ల వేగంతో సుభాష్ ఎంద్రబోస్ కాలనీ వైపు సాగిపోయింది నన్ను తీసుకుని

మధుమూర్తి ఇంటి కాంపవుండ్‌లో మోటార్ బైక్‌ను ఆపి దిగి స్టాండు వేశానో లేదో మధుమూర్తి పిల్లలు ముగ్గురూ పరిగెత్తుకువచ్చి నన్ను చుట్టుముట్టారు

"బాబాయ్ ... బాబాయ్ అమ్మ ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటుంది బాబాయ్!" అంది చిన్నపిల్ల

"అవును బాబాయ్! అమ్మ ఏడుస్తూనే వుంటుంది అన్నమే తినదు ఏమీ తినదు" అన్నాడు పెద్దకుర్రాడు

వాళ్ళ మాటలు విని ఆఖరి కుర్రవాడు బిక్కమొహంపెట్టి నాకేసి చూస్తున్నాడు

ఆశ్చర్యంతోపాటు కంపరం పుట్టింది నాకు

"అలాగా" అంటూ పాపను యెత్తుకుని ఇంట్లోకి నడిచాను సుజాతను చూడగానే పిల్లలు చెప్పింది మాటకి మాటు పొళ్ళు నిజమని అర్థం అయింది నాకు

తెల్లగా బొద్దుగా వుండి ముఖంలో లక్ష్మీకళ తాండవిస్తూండగా నిండుగా భూదేవిలా కన్పించే సుజాత కొద్దిగా సన్నబడి పీక్కుపోయిన మొహంతో కళావిహీనంగా శోకదేవతలా కన్పిస్తోంది

కంపెనీ పనుల ఒత్తిడివల్ల, మా కంపెనీ బ్రాంచి ఆఫీసులున్న ఊళ్ళకు తరచుగా క్యాంపులు వెళ్ళిరావాల్సిరావడం వల్ల సుజాతను చూసి రెండునెలలు దాటింది మధుమూర్తితో ఎదురుపడ్డప్పుడు మాట్లాడడంతప్ప ఈ రెండు నెలలలో మధుమూర్తి ఇంటికి రావడం కుదరలేదు నాకు 'ఈమధ్యలో ఏదో జరిగింది' అనుకుంటూ సోఫాలో కూర్చున్నాను

"ఏమిటండీ ఈ అన్యాయం? యింతగా చిక్కిపోయారు ఒంట్లో బాగోలేదా?" అని అడిగాను

సుజాత జవాబు చెప్పలేదు మౌనంగా వంట గదిలోకి వెళ్ళిపోయింది

'వ్యవహారం ఏదయినా కానీ చాల పెద్దదే' అనుకున్నాను

రెండు నిముషాలలో ట్రేలో ఓ ప్లేటులో సాల్టు బిస్కట్లు, కప్పులో వేడి కాఫీ వుంచుకుని తీసుకువచ్చింది ఆమె

బిస్కట్లన్నీ కాఫీలో అద్దుకుని తినేశాను కాఫీ కప్పు ఖాళీ అయిపోయింది బిస్కట్లు అద్దుకుని తినడంవలన మళ్ళీ కప్పు నిండుగా కాఫీని నింపింది ఆమె కాఫీ త్రాగేసి రెడ్‌విల్సు



సిగరెట్ వెలిగించుకుని ప్రశ్నార్థకంగా సుజాత వైపు చూశాను

నా చేతికి ఓ ఉత్తరాన్ని అందించింది ఆమె మౌనంగానే

పోస్టు ముద్రలను బట్టి అది దాదాపు పదిహేనురోజుల క్రితం పోస్టు చెయ్యబడ్డ ఉత్తరం అని గ్రహించాను సుజాతకు వ్రాయబడ్డ ఉత్తరం అది

శ్రీమతి సుజాతామూర్తిగారికి,

ఒక శ్రేయోభిలాషి వ్రాయు ఉత్తరం మీ భర్త మధుమూర్తిగారిని మీరెందుకు యిలా వదిలిపెట్టేశారో తెలియడంలేదు అతను చాలాకాలంగా కూడా చిల్లరమల్లర తిరుగుళ్ళు తిరుగుతున్నాడు

ఈమధ్య అంటే దాదాపు రెండు నెలలుగా స్టాండర్డ్ ఎంటర్‌ప్రయిజస్ కంపెనీలో పనిచేసే టైపిస్టు శ్రీప్రియతో ఏకంగా ఇంకో కాపురమే పెట్టేశాడు గాంధీ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయా రోడ్డులో 2–3–124 నంబరు ఇంటిలో

ఇకనైనా జాగ్రత్తపడి కాపురాన్ని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించమని సలహా ఇస్తున్నాను

ఉత్తరం చివర్న సంతకం లేదు

"అబ్బే ఇలాంటి విషయాలు మనం నమ్మకూడదండీ ఎవరో దొంగ వెధవలు రాసి ఉండవచ్చు" అన్నాను

పైకి అలా అన్నాను కానీ మనసులో అనుమానంగానే ఉంది నాకు 'మన దేవుడి సత్యం ఇలాంటిదే కదా' అని

"నేను ఈ ఉత్తరాన్ని గూర్చి వారిని అడిగాను."

'పగటి కలలు' లో కవిత



అంది ఆమె కంఠస్వరం కూడా పూర్తిగా మారిపోయి ఉంది ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్టుగా ఉంది ఆమె స్వరం

"ఏమన్నాడు?" క్యూరియస్‌గా అడిగాను

"నిజమే అన్నారు ఆమెను తను వదులుకోలేరట"

సుజాత కళ్ళలోంచి కన్నీరు జలజలా రాలుతున్నాయి

నేను సుజాత కళ్ళలో నీళ్ళు చూడడం ఇదే మొదటి పర్యాయం 'మధుమూర్తి ఎందుకిలా చేశాడు?' అన్న ప్రశ్న నన్ను వేధిస్తోంది మధుమూర్తి ఎవరినో ఉంచుకోవడం నాలాంటి వాడికి పెద్ద తప్పనిపించదు కానీ ఆ విషయం నలుగురికీ తెలిసేలా చేయడం, ముఖ్యంగా కట్టుకున్న భార్యకు నిజాన్ని చెప్పడం చాల పెద్దతప్పు నా దృష్టిలో

ఈ ఆలోచనలతో నేను సతమతం అయిపోతూ ఉండగానే సుజాత చెప్పుకు పోతోంది కన్నీటితో

"ఆయన ఇలాంటి వారని కలలో కూడా అనుకోలేదన్నయ్యా! నన్నూ పిల్లల్నీ ఎంత ప్రేమతో చూసుకునే వారు? కొంతకాలంగానే మరీ విసుగ్గా ఉంటున్నారు ఇంట్లో ప్రతి చిన్న విషయానికీ, కోపపడ్డం అలవాటు చేసుకునేశారు ఈ మధ్య కాలంలో

ఆయనతో మాట్లాడాలన్నా కూడా భయపడాల్సి వస్తోంది నేనూ పిల్లలూ ఈ గడచిన రెండు నెలల నుండీ మరీ ఎక్కువ అయిపోయింది ఆయన ఏంత ప్రవర్తన ఈ మధ్యన అయితే తరచుగా రాత్రులందు ఇంటికి రావడం మానేశారు ఏమి అడిగినా కోపమే బిజినెస్ వ్యవహారాలతో మరీ బిజీగా ఉండి చికాగ్గా ఉన్నారేమో అని సరిపెట్టుకునేదాన్ని కానీ చివరికి ఈ ఉత్తరం వచ్చాక అంతా తేటతెల్లమైంది"

నాకు మహాకోపం వస్తోంది మధుమూర్తిమీద

ఈ ప్రపంచంలో తప్పచేయని మానవుడు సామాన్యంగా ఉండడనే నా అభిప్రాయం తప్పతే చెయ్యని వ్యక్తి ఎవరైనా ఉన్నా వారు తప్పకుండా మరుజన్మలో కుక్కయి పుడ్తారని నా నమ్మకం కూడా అందువలన తప్పులు చేసేవాళ్ళంటే నాకు పెద్దగా నీచమైన అభిప్రాయాలు వగైరాలు ఏర్పడవు కానీ చేసే తప్పలేవో మూడవ కంటికి తెలియకుండా చెయ్యడం మంచిది అని అన్పిస్తుంది

మధుమూర్తీ నేనూ ఐస్క్రీములు తినే వయసప్పటినుండీ స్నేహితులము

కలసి అయిస్క్రీములు తిన్నాము ఆ తరువాత కొంత కాలానికి కలసి కాఫీహోటల్లలో టీలు త్రాగాము కలసి పేకాటలు ఆడాము కలసి బ్రాందీ త్రాగడం అలవాటు చేసుకున్నాము ఎన్నో వందలసార్లు కలసి త్రాగాము

మదిరతోపాటు మానినిని కూడా కలసి అనుభవించేవారిమే కానీ కొన్ని కారణాలవలన ఆ ఒక్క విషయంలో మాత్రం మేము కలియలేదు ముఖ్య కారణం ఏమిటంటే ఆ ఒక్క విషయంలో మాత్రం కలసి అనుభవించడం అనేది మా ఇద్దరికీ కూడా అసహ్యమే అవడం

యం ఏ రెండవ సంవత్సరం ఆఖరి

రోజులలో మధుమూర్తి సుజాతను ప్రేమించడమూ, నేను నళినిని ప్రేమించడమూ పరీక్షలు అయిపోగానే మధుమూర్తి సుజాత ప్రేమను పొంది ఆమెను పెళ్ళి చేసుకోవడమూ ... నళిని నన్ను పురుగును నలిపినట్లు నలిపివేసి మరొక వ్యక్తిని పెళ్ళి చేసేసుకోవడమూ చకచకా జరిగిపోయాయి.

మధుమూర్తి తన తండ్రికి విశ్రాంతిని ఇచ్చి తమకున్న బిజినెస్ యొక్క మేనేజిమెంటును తను తీసుకున్నాడు. నా తండ్రి పెద్దగా డబ్బున్నవాడు కాకపోవడంవల్ల నేను యం. ఏ. డిగ్రీతో వీధిన పడ్డాను.

దాదాపు రెండేళ్ళు నిరుద్యోగపర్వం. ఆ తరువాత కొద్దిరోజుల తేడాతో తల్లిదండ్రులు పోవడం, ప్రపంచంలో బంధువు అనేవాడు లేకుండా ఏకాకిని అయిపోయిన నాకు పిచ్చిలాంటి దేదో ఆవహించడంతో నిజంగానే పిచ్చివానిలా తయారయ్యాను ఒకరకంగా.

మా నాన్న దాచిపెట్టి వుంచిన కొద్దిపాటి డబ్బూ, ఆయన ప్రావిడెంట్‌ఫండూ ఏకైక వారసుడైన నా చేతికి అందడంతో ఆ డబ్బును ఖర్చుచేస్తూ రాత్రింబవళ్ళూ తప్పత్రాగి ఎక్కడ పడితే అక్కడ పడిపోవడం మొదలుపెట్టాను. అవి నిజంగా నా జీవితంలో చాల చెడ్డరోజులు ఒక మృగంలా, వింత జంతువులా వుండేవాణ్ణి, గడిపేవాన్ని ఆ రోజులలో.

ఆ రోజులలో మధుమూర్తి నన్ను యెంతో ఆదరించాడు. ఎక్కడెక్కడో త్రాగి పడిపోయే నన్ను వెతికి పట్టుకుని ఏ సమయంలో అయినా సరే టాక్సీలోనో, జట్కాలోనో వేసుకుని తన ఇంటికి తీసుకువెళ్ళేవాడు.

అతనూ, సుజాతా అసహ్యించుకోకుండా నా మొహమూ అదీ తుడచి, బట్టలు, జోళ్ళు విప్పదీసి తిండి తిన్పించేవారు. ఆ రోజులలో మధుమూర్తీ, సుజాతా నన్ను చూసినంత ప్రేమగా ఏ అన్నా వదినా కూడా తమ స్వంత తమ్ముణ్ణి ... మరిదిని చూసివుండరు.

చివరికి వారి ప్రేమ ముందు నా మృగత్వం నశించిపోయింది. వారిచే సంస్కరింపబడ్డ నేను విజయభారత్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో వందా పాతిక రూపాయల జీతానికి గుమాస్తాగా చేరాను. అక్కడ చేరిన తరువాత యం. ఏ. డిగ్రీ తీసుకున్నందుకు కొద్దిగా బాధపడ్డాను ఏ యల్. యం. ఇ. అయినా చదివి వుండివుంటేనే బావుండేదని అన్పించింది.

తీరిక సమయాలలో కంపెనీ షెడ్లలో మెకానిజాన్ని, మొదలైన పనులను అబ్జర్వుచేస్తూ, మెకానిజానికి సంబంధించిన అన్ని పుస్తకాలూ తెప్పించి చదవడం ప్రారంభించాను.

ఆసక్తి అనేది వున్నవాడికి ఈ ప్రపంచంలో అపజయం అనేదే వుండదు. అచిరకాలంలోనే అదే కంపెనీలో అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ అయ్యాను. ఆ తరువాత ఫోర్‌మెన్ అయ్యాను. అలా ఒక్కో మెట్టే పైకి ఎక్కివచ్చి యిప్పుడు అదే కంపెనీలో ట్రాన్స్‌పోర్ట్ మేనేజరు అయ్యాను.

నా శని రోజులన్నీ వెళ్ళిపోయాయి దాదాపుగా.

నేను ఈరోజు ఇలా వుండడాన్కి ముఖ్యమైన పునాదులు వేసినవారు సుజాతా మధుమూర్తులు

వారు నా స్వంతం, నా ప్రాణం. వారి కుటుంబంలో ఎవరికి ఏం అపకారం జరిగినా నాకు జరిగినట్లే.

'ఇడియట్, స్టుపిడ్, ఇంటెలిజంట్ మఫ్' అని తిట్టుకున్నాను మధుమూర్తిని.

సుజాత ఏడుస్తోంది. ఏడుస్తూ చెప్పకు పోతోంది.

''నేను ఎప్పుడూ ఎవరి ఎంగిలీ తిన్నదాన్ని కాదన్నయ్యా! నా పిల్లలు ఎంగిలి చేసిన పదార్థాలు కూడా నేను తినను. నాకెందుకో అంత అసహ్యం ఎంగిలి పడ్డం అంటే.

ఇది... ఈ... ఈ విషయం తెలిసినప్పటి నుండీ నేను అసహ్యంతో చచ్చిపోతున్నాను. నాకు బ్రతకాలని ఎంతమాత్రమూ లేదన్నయ్యా.. నా తరువాత ఈ పిల్లలు ...''

ఆపై మాటలు పెగలకుండాపోవడంవల్ల చేతులతో మొహం కప్పుకుంది ఆమె.

''వద్దండీ.. వద్దు. అంతంత మాటలు అనకండి. నేను ఇంకా ప్రాణాలతోనే ఉన్నాను. ఆ మనిషిని ఎవరినో మధుమూర్తి జీవితంలోంచి తొలగిస్తాను'' అన్నాను ఆవేశంగా.

''చూస్తానన్నయ్యా. ఆయనకూ అదే చెప్పేశాను. ఆమెను ఆయన వదులుకోలేని పక్షంలో నేను ఈ లోకాన్నే వదులుకోవాల్సి వస్తుందని నాకూ అంతకన్నా ఇంకో మార్గం కన్పించడంలేదు. నేను ఏమయినా అయిపోతే... పిల్లల్ని... సిమ్లా హిల్సులో ఉన్న మా అన్నయ్య దగ్గరకు చేర్చవలసిన బాధ్యత మీది.'' అంది ఆమె గద్గదంగా.

''మీరు ఇలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకండి. నేను అన్నీ సరిచేస్తాను.'' అంటూ ఆ ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకున్నాను.

'స్టాండర్డ్ ఎంటర్‌ప్రయిజన్‌లో పనిచేసే శ్రీప్రియ' అని రెండు మూడుసార్లు చదువుకుని ఉత్తరం సుజాతకు అందించేశాను.

హఠాత్తుగా నాకో విషయం జ్ఞాపకం వచ్చింది.

దాదాపు మూడు నాలుగు నెలల క్రితం మిస్టర్ డేవిడ్ జాన్ ఇంట్లో జరిగిన ఏదో పార్టీకి మధుమూర్తి ఒక అమ్మాయిని వెంటతీసుకుని వచ్చాడు. ఆ పార్టీకి అటెండయిన నాకు ఆ అమ్మాయిని పరిచయం చేస్తూ శ్రీప్రియ అనే చెప్పినట్లు జ్ఞాపకం.

'ఐ. సీ!' అనుకుని తల పంకించాను.

మధుమూర్తికి గర్ల్‌ఫ్రెండ్స్ ఎక్కువ.

నాకూ గర్ల్‌ఫ్రెండ్స్ ఎక్కువే!

ఎప్పుడైనా మేమిద్దరమూ కలసి మందులో కూర్చున్నప్పుడు నా గర్ల్‌ఫ్రెండ్సును గూర్చీ, వారితో నేను పొందిన ఆనందాన్ని గూర్చీ మధుమూర్తికి చెప్పడం, అతని అనుభవాలు నేను వినడం మాకు పరిపాటి.

నాకు పెళ్ళీ పెడాకులు లేవు. కానీ పెళ్ళయి పిల్లల తండ్రి అయినా మధుమూర్తిలో ఆ పాత అలవాట్లు పూర్తిగా మాసిపోలేదు. అతను సుజాతకు ద్రోహం చేస్తున్నాడని నేను కొద్దిగా బాధపడ్డా అతనితో ఏమీ అనగలిగేవాణ్ణి కాను. ఎందుకంటే అవే తప్పులు నేను చేస్తూ అతనికి ఎలా బుద్ధిమాటలు చెప్పగలను ?

కానీ అతను ఎవర్నో పబ్లిగ్గా ఉంచేసుకోవడం, పైగా ఆ విషయాన్ని గూర్చి భార్యకు తెలియ చెప్పడం నాకు మరీ కోపాన్ని కలిగించాయి.

అతను అందినంతవరకూ ఆనందాన్ని అనుభవించడంలో తప్పు లేకపోవచ్చు. కానీ ఇంట్లో భార్యాపిల్లలకు తన జీవిత రహస్యాలు తెలిసేంత వరకూ తెచ్చుకుని వారి జీవితాలను నరకప్రాయం చెయ్యడం చాల పెద్ద తప్పు.

''నిన్న ఉదయం అనగా వెళ్ళారు ఇంట్లోంచి. ఇంతవరకూ ఇంటికి రాలేదు ఆయన!'' అంది సుజాత.

సుజాతకు ధైర్యం చెప్పి నేను మధుమూర్తి కోసం బయల్దేరాను మోటార్‌బైక్ మీద.

* * *

దురదృష్టవశాత్తు మధుమూర్తి ఆవేళే అనెక్స్‌పెక్టెడ్‌గా మద్రాసు వెళ్ళాడు తన కంపెనీ పనిమీద. అతను రావడాన్కి రెండు మూడు రోజులు పట్టవచ్చని తెలిసింది నాకు.

నేరుగా ఫ్లైట్‌లో వెళ్ళి మద్రాసులో దిగి అక్కడే మధుమూర్తిని కలుసుకుని మాట్లాడాలని అనుకున్నాను మొదట. కానీ ఆ ఆలోచన విరమించుకుని శ్రీప్రియను గూర్చి యంక్వయిరీ మొదలుపెట్టాను.

* * *

''మధూ! యూ డిడ్ ఎ బ్యాడ్ జాబ్!'' అన్నాను మధుమూర్తిని కలుసుకోగానే.

'ఏమిట్రా ?'' అని అన్నాడు అతడు

''అదే ... ఆ శ్రీప్రియ విషయం.''

''ఏముందిరా, అనుకోకుండా నా జీవితంలో ప్రవేశించింది. మొదట స్వార్థంతోనే పరిచయం పెంపొందించుకున్నా, ఆమె నా హృదయాంతరాల్లోకి చొచ్చుకుపోవడంవలన ఇక వదులుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వదుల్కోలేకపోయాను! చట్టరీత్యా రెండు పెండ్లిళ్ళు చేసుకోరాదుగా, అందువల్ల పెళ్ళి చేసుకోకుండానే కాపురం పెట్టేశాము'' అన్నాడు సావధానంగా.

''బట్ యూ ఆర్ హ్యావింగ్ త్రీ చిల్డ్రన్.''

''అఫ్‌కోర్స్! వారికి కావాల్సినదానికి దేనికీ లోటు చెయ్యడంలేదుకదా? నా భార్య పేరిటా, పిల్లల పేరిటా కావల్సినంత డబ్బు వేసి వుంచేశాను కూడా ఫిక్స్‌డ్‌గా.''

''ఇడియట్‌లా మాట్లాడకు మధూ! మనిషికి కావాల్సినది ఒక్క డబ్బు మాత్రమే కాదు'' అన్నాను కోపంగా.

''డోన్ట్ బి సిల్లీ శేఖర్! నా భార్యా పిల్లలకు ప్రేమానురాగాలలో సైతం నేను లోటు చెయ్యడం లేదు. కానయితే శ్రీప్రియ నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించింది. అందువలన ఆమెకు నేను కావాలి, నాకు ఆమె కావాలి. అంతే!''

''కానీ ఒక ఒరలో రెండు కత్తులు ఇమడ్చడం

యెంత కష్టమో అంత కష్టం నీ జీవితంలో ఒకో మనిషికి స్థానం ఇవ్వడం.''

''కానీ తప్పడంలేదు !''

''మధూ ! నీ ప్రాణమిత్రుడిగా చెపుతున్నాను. శ్రీప్రియను వదిలెయ్యి. ఆమెకు యెంత డబ్బు కావల్సివచ్చినా సరే యిచ్చేసి వదిలించుకో ''

''వాట్ నాన్‌సెన్స్ యూ ఆర్ టాకింగ్. దట్స్ హైలీ ఇంపాజిబుల్. నీవు కాదుగదా ఆ దేవుడు కూడా నా మనసు మార్చలేడు. శ్రీప్రియను నేను వదలడం కల్ల'' అన్నాడు మధుమూర్తి కోపంగా.

''అగ్గిపడు. కానీ ఈ విషయం రహస్యంగా ఉంచాల్సింది. ఎందుకు పబ్లిక్ చేసుకున్నావు ? ఎందుకు సుజాతకు తెలిపావు ? ?''

''రహస్యంగా ఉంచడం శ్రీప్రియకు ఇష్టం లేదు. రెండవ విషయం సుజాతకు నిజం చెప్పకుండా ఉండలేకపోయాను !''

''నీ నిజాయితీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాల్సిందేలే ! కానీ ప్రళయం సృష్టించే నిజంకన్నా, అమృతం చిలికించే అపద్ధం వెయ్యిరెట్లు మంచిది ఈ ప్రపంచంలో. సరే నీవు శ్రీప్రియను వదిలిపెట్టెయ్యడం కోసం నేనేం చెయ్యాలి ? '

''నీవేమీ చెయ్యలేవని చెప్పానుగదరా '' అన్నాడు మధుమూర్తి విసుగ్గా.

ఇక ఆపై నాకు ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో ఎప్పన స్ఫురించలేదు. మధుమూర్తి తెప్పించిన బోర్నవీటా త్రాగేసి లేచి వస్తూ అడిగాను,

''నేను ఆ శ్రీప్రియను కలుసుకుని మాట్లాడాలని అనుకుంటున్నాను. నీకేమయినా అభ్యంతరమా ?''

మధుమూర్తి లోలోపలే నవ్వుకున్నాడు పరిహాసంగా.

''నాకు నేలాంటి అభ్యంతరమూ లేదు. వెళ్ళి కలుసుకో ! అయితే కో యూన్'' అన్నాడు.

''ఉపయోగం లేకపోతే పోనీ... నా ప్రయత్నం నేను చెయ్యాగా '' అంటూ బయల్దేరాను.

* * *

ఇల్లు మరీ పెద్దదీ కాదు, మరీ చిన్నదీ కాదు మధ్యరకంగా వుంది. ఫర్నిచర్ కూడా చాల పెద్దగాలేదు. అయితే ఉన్నదంతా కాస్ట్లీవెరయిటీకి చెందినదే

శ్రీప్రియకు నన్ను నేను పరిచయం చేసుకోవాల్సిన అవసరం లేకపోయింది. ఎందుకంటే ఆమెకు నేను జ్ఞాపకం ఉన్నానట. అందువలన సాదరంగా ఆహ్వానించింది ఆమె నన్ను.

వెళ్ళి హాల్లోని యూఫోం సోఫాలో కూర్చున్నాను.

''ఏం తీసుకుంటారు ? కాఫీ, టీ, హార్లిక్స్, బూస్ట్ ?'' అని అడిగింది ఆమె. చైనా అలారం గడియారం మృదువుగా అలారం కొట్టినట్లుంది ఆమె కంఠస్వరం.

చక్కటి రూపం; చక్కటి అవయవసౌష్టవం; గులాబీరంగు శరీరం కలిగివున్న ఆమెకేసి పరీక్షగా చూశాను. చంద్రబింబంలాంటి ముఖంలో తీర్చిదిద్దినట్లున్న కనుబొమలు; తామరరేకులవంటి కళ్ళు; ఆకర్షణీయమైన ముక్కు, లేత తమలపాకులవంటి పెదవులు, దానిమ్మగింజలవంటి పలువరుస... వీటన్నింటినీ మించిన కేశ సౌందర్యం. నిజంగా చాలా అందమైన యువతి ఈమె.

''ఒరేయ్ మధుగా ! నీకు పెళ్ళి కాకుండా ఉండి, ముగ్గురు పిల్లలు పుట్టకుండా ఉండి ఉంటే నిన్ను తప్పకుండా అప్రిషియేట్‌చేసి ఉండేవాణ్ణి'' అనుకున్నాను మనసులో !

''వేడిగా ఏదయినా తీసుకుంటాను. సాల్టు బిస్కట్లు ఉంటే కలిపి తీసుకుంటాను'' అన్నాను.

పది నిముషాలలో ఆమె వేడి టీ, క్రాక్ జాక్ బిస్కట్లు పట్టుకువచ్చింది వంటగదిలోంచి.

బిస్కట్లు తినేసి రెండు కప్పుల టీ త్రాగేశాను. దాంతో బాగా ఉత్సాహం వచ్చింది. రెడ్‌విల్సు సిగరెట్ వెలిగించుకున్నాను.

''శ్రీప్రియగారూ, మధుమూర్తికి అందమైన భార్యా, ముగ్గురు పిల్లలూ వున్నారని మీకు తెలుసని అనుకుంటాను.'' అన్నాను ఏకంగా రంగం మధ్యకు దిగుతూ

## రచయితలకు మనవి

కథలు పంపేవారు కూడా విడిగా తపాలా బిళ్ళలు పంపటం, లేదా కథ పంపిన కొంత కాలానికి తపాలా బిళ్ళలు పంపటం చేయవద్దని మనవి. కథల పరిశీలనకు ఆరు నుంచి పది వారాలు పట్టవచ్చును. కథ ప్రచురణామోదం పొందిన వెంటనే రచయితకు కార్డు ద్వారా తెలియజేస్తాము. నవలల విషయంలో ఏ విషయం తెలియటానికి నాలుగు మాసాలు పట్టవచ్చును. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదని మరోసారి మనవిచేస్తూ - మాతో రచయితలంతా పై నిబంధనల విషయంలో సహకరించాలని కోరుతున్నాము. కలర్ ట్రాన్స్‌పెరెన్సీలు పంపేవారు గూడా తిరుగు టపా కవరు పెట్టడం అవసరం. సం॥

''తెలుసు !'' అంది ఆమె ముక్తసరిగా.

''తెలిసీ మీరు ఎందుకు ముందడుగు వేశారో అర్థంకావడంలేదు.''

''నేను వారినీ, వారు నన్నూ మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాము. అందువలన ముందడుగు వేయక తప్పలేదు.''

''ఓహో, అలాగా ! అయితే 1973వ సంవత్సరంలో మీరు రాజ్‌కుమార్ అనే యువకుడ్ని మనస్ఫూర్తిగా ప్రేమించారుగా ? అప్పుడు ఎందుకు ముందడుగు వేయలేకపోయారు ? నిరుద్యోగి అయిన రాజ్‌కుమార్ మిమ్మల్ని ఏం పోషించగలడనా ?

1976 లో గోవిందరెడ్డిని మనస్ఫూర్తిగా ప్రేమించారుగా అప్పుడెందుకు ముందడుగు వేయలేకపోయారు ? గోవిందరెడ్డికి వచ్చే 400 రూపాయల జీతంతో యెలా బ్రతకడం అని భయపడ్డారా ?''

అని అన్నాను వ్యంగ్యంగా. మధుమూర్తి మద్రాసు నుండి వచ్చేలోగా నేను త్రవ్వి తీసిన శ్రీప్రియ జీవిత విశేషాలలో రెండు ఇవి.

ఆమె కోపంగా చూసింది నావైపు.

''అది నా అంతరంగిక విషయం. మీ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన అవసరం నాకు ఎంతమాత్రమూ లేదు. మీకు అంతగా ఇలాంటి ప్రశ్నలకు జవాబులు కావాల్సివుంటే వెళ్ళి మీ పురాతన ప్రియురాలు నళినిని అడగండి 1969 వ సంవత్సరంలో మిమ్మల్ని పెళ్ళి చేసుకోవడానికి ఎందుకు ముందడుగు వెయ్యలేకపోయిందో ?'' అంది.

''ఓహో ! అయితే నా ఆప్తమిత్రుడు మధుమూర్తి . ఛ ... సారీ ... మీ ప్రాణేశ్వరుడు మధుమూర్తి మీకు తనను గూర్చి, తన సమస్తాన్ని గూర్చి, అంటే నాలాంటి స్నేహితుల వివరాలతో సహా అన్నీ చెప్పేశాడన్నమాట.''

''అక్షరాలా ! ముఖ్యంగా మీలాంటి ప్రాణమిత్రుల క్యారక్టరును గూర్చి కూడా !'' అంది ఆమె అసలే చిన్నపోయిన నాకు మరో మరక అంటిస్తూ.

''శ్రీప్రియగారూ!'' అన్నాను పాత సిగరెట్ పారవేసి మరో రెడ్‌విల్సు అంటించుకుంటూ.

''నేను బ్యాడ్ క్యారక్టర్ కలిగిన వాణ్ణే కావచ్చు కానీ ప్రాణమిత్రుడుగా మధుమూర్తి ఇంటిని నిలబెట్టవలసిన అవసరం, బాధ్యత నామీద వుండడంవల్ల మిమ్మల్ని కలుసుకున్నానని మరచిపోకండి.''

''అఫ్‌కోర్స్ ... ఆయన ఇల్లు కూలిపోవడం లేదులెండి.''

''ఇంకా ఏం కూలిపోవాలిలెండి...వ్యక్తిగతంగా నాకు మీపై ఎలాంటి ద్వేషభావమూ లేదు. అలాగే నాపై మీకూ వుండదు. కాబట్టి స్నేహితులలా మాట్లాడుకుని ఒక నిర్ణయానికి వద్దాము'' అన్నాను.

''నాకు మీపై వ్యక్తిగత ద్వేషం లేదని ఒప్పుకుంటాను. కానీ మనం చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన విషయం ఏదీ మన మధ్య లేదు.'' అంది ఆమె నిర్మొహమాటంగా.

''ఎందుకు లేదు ? వుంది ! మధుమూర్తి కుటుంబానికి సంబంధించిన ప్రతివిషయమూ నా స్వంత విషయమే ! అందువల్ల మన మధ్య విషయం వుంది'' అన్నాను.

''పోనీ కాసేపు అలాగే అనుకుందాం. చెప్పండి.''

''అలా అన్నారు బావుంది. చెప్పండి ఎంత డబ్బు కావాలి మీకు మధుమూర్తికి గుడ్‌బై చెప్పడానికి'' అని అడిగాను సౌమ్యంగా.

ఆమె మొహం జేవురించింది. కోపంతో పెదవులు వణకుతూ వుండగా ''గెట్‌అవుట్ ... ఫస్ట్ యూ మస్ట్ గెటవుట్'' అని అరిచింది.

నేను సిగ్గుపడలేదు. కోపమూ తెచ్చుకోలేదు.

''పోనీ ఏం చేస్తే మీరు మధుమూర్తిని విడిచిపెడతారో చెప్పండి'' అన్నాను.

# తెగిపోయిన గాలిపటాలు

''మీరు ఏం చేసినా అది సాధ్యంకాదు. అందుకే వెళ్ళిపొండి.''

ఇక ఏం మాట్లాడాలా అని ఆలోచనలో పడ్డాను. నా కళ్ళ ముందు కన్నీరు కారుస్తున్న సుజాత రూపం మెదులుతూవుంది. అందువలన అక్కడ్నుండి కదలలేకపోయాను.

''ఇంతకూ మీరెవరు? మీకేమిటి సంబంధం?'' అంటూ రెచ్చిపోయింది ఆమె మౌనంగా వున్న నన్ను చూసి.

''చూడండీ, ఈ ప్రపంచంలో ముఖ్యమైన ధర్మాలు మూడే మూడు. స్వధర్మం, వృత్తి ధర్మం, స్నేహ ధర్మం. నేనెవరో మీకు తెలుసు. ఇక సంబంధమా అది ఈ మూడవ ధర్మానికి అంటే మిత్ర ధర్మానికి సంబంధించినది'' అన్నాను తాపీగా.

''మీరు ఎన్ని చెప్పినా ఏం చేసినా నన్ను మధూ నుండి దూరం చెయ్యలేరు'' అంది ఆమె.

''ఏదో ఒకటి చెయ్యక తప్పదు నేను.'' అంటూ సిగరెట్ టీపాయిమీద వున్న ఆష్‌ట్రేలో పడవేసి నా స్వంత ఇంట్లోలా ఆ హాల్లో అటూ ఇటూ పచార్లుచెయ్యడం మొదలుపెట్టాను.

ఇంకో కప్పు వేడి టీ తాగితే బావుండునని అన్పించింది. కానీ విసుగ్గా సోఫాలో కూలబడి నాకేసి కోపంగా చూస్తున్న శ్రీప్రియను కాఫీ ఇవ్వమనడం సభ్యత కాదనిపించినందువల్ల మరో సిగరెట్ వెలిగించుకున్నాను. ఏదో ఒకటి చెయ్యాలి నేను

ప్రాణదానం చేసిన మిత్రుడు మధుమూర్తి. ఆ రోజులలో అతడు నన్ను వదిలిపెట్టేసి వుంటే తాగి తాగి గుండె పగిలి ఏరోజో చచ్చిపోయి వుండేవాణ్ణి నేను నన్ను మనిషిగా నిలబెట్టినవాడు మధుమూర్తి. నాకు జీవితం మీద ఆసక్తిని కలిగించిన సోదరి సుజాత. వీరు ఇరువురూ ఆనందంగా మునుపటిలా గడపడం కోసం నేనేమైనా చెయ్యాలి.

ఆలోచిస్తూ అటూ యిటూ తిరుగుతున్న నాకు శ్రీప్రియను చూస్తుంటే ఒళ్ళు మండిపోవడం మొదలయింది. ఈ గొడవకంతా మూలకారణం ఈమె. ఈమె లేకపోతే ఈ గందరగోళమే వుండేదికాదు.

ఇప్పుడైనా ఈమె ఎటయినా వెళ్ళిపోతే, లేదా ఈమెను యిక్కడ లేకుండా ఏదయినా చేస్తే ... అసలు లేకుండా చేయగలిగితే...?

హఠాత్తుగా నా ఆలోచనలు ఆగిపోయాయి. పచార్లు ఆపి నిలబడిపోయాను.

''ఒక్కటే మార్గం కనిపిస్తోంది!'' అన్నాను.

''ఏమిటి?''

''నిన్ను చంపేస్తే, ఈ సమస్య అంతా సాల్వ్ అయిపోతుంది.'' అన్నాను ఎక్సయిటెడ్‌గా.

అరనిముషంపాటు తదేకంగా నావైపు చూసిన ఆమె నవ్వసాగింది పగలబడి. రెండు నిముషాలపాటు నిలపకుండా నవ్వింది.

''ఈ ఈక్వేషనుకు సొల్యూషన్ లేదు శేఖర్ గారూ. ఇలా గందరగోళంగా సాగిపోవాల్సిందే. ఎందుకు శ్రమపడుతారు? వెళ్ళండి.'' అంది చివరికి నవ్వు ఆపి.

''ప్రతి ఈక్వేషనుకూ ఒక సొల్యూషను ఉండక తప్పదు శ్రీప్రియగారూ. ఈ ఈక్వేషను బహుశా మీ మరణంతోనే సాల్వ్ అవక తప్పేలా లేదు!'' అన్నాను కఠినంగా.

మళ్ళీ నవ్వింది ఆమె. ''ఎలా?'' అని అడిగింది నవ్వుతూ.

''చెప్పానుగా... మిమ్మల్ని నేను చంపెయ్యక తప్పదు. అంటే మీరు మధుమూర్తిని వదులుకోని పక్షంలో.''

ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి నా సీరియస్ నెస్ చూసి.

''అయితే మీరు నన్ను చంపెయ్యడానికికూడా సిద్ధం అన్నమాట. అయినా మీరు నన్ను చంపి తప్పించుకునిపోలేరు. మీ నేరం బయటపడి మీరు శిక్ష అనుభవించక తప్పదుగా?'' అని అడిగింది.

ఈ పర్యాయం నేను నవ్వాను.

''నేను ఏ మ్యాన్ ఆఫ్ గ్రేట్ క్యారక్టర్ కాకపోవచ్చు. కానీ నేను ఏ మ్యాన్ ఆఫ్ స్ట్రిక్ట్ డిసిప్లిన్ నా ప్రాణమిత్రుడి కాపురం బాగవడం కోసం, ఒక ధర్మాన్ని నిర్వర్తించడం కోసం నిన్ను చంపేస్తాను. కానీ తప్పించుకుని పారిపోయేంత పిరికివాణ్ణి మాత్రం కాను. నిన్ను చంపేసిన మరుక్షణం నేనే స్వయంగా వెళ్ళి పోలీసులకు సరండర్ అయిపోతాను.'' అన్నాను సీరియస్‌గా.

శ్రీప్రియ నా మొహం చూస్తూ ఆలోచనలో పడింది.

ఆమెను భయపెట్టడం మాత్రమేనా? లేక ఆమెను నిజంగా హత్య చెయ్యగలనా?? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. జవాబు చప్పున స్ఫురించ లేదు

''నన్ను ఎలా చంపేస్తారు?'' అని అడిగింది ఆమె. పరిహాసంగానో, సీరియస్‌గానో నాకు అంతుబట్టలేదు. ఒక నిముషం ఆలోచించి తాపీగా జవాబు చెప్పాను.

''ఎలా చంపేస్తానో ఇప్పుడు ఖచ్చితంగా చెప్పలేను. బజార్లో ఎక్కడైనా నీవు వస్తున్నప్పుడు నా కారును నీమీదుగా నడిపించేస్తానేమో? మరెక్కడైనా నీవు వెళ్తున్నప్పుడు నా మోటారు సైకిలుమీద నేను వేగంగా వచ్చి నిన్ను ఢీకొట్టేస్తానేమో? లేదా నా తుపాకితో నీ తల పేల్చేయవచ్చు. అదీ కాకపోతే కత్తితో నీ గుండెలో పొడిచెయ్యవచ్చు. మొత్తానికి ఏదో ఒక్కటిచేసి నేను నిన్ను చంపేస్తాను ఖచ్చితంగా... విధిలేని పరిస్థితి వస్తే! బహుశా అలాంటి పరిస్థితి రాదని నేను ఆశిస్తాను.'' అన్నాను.

ఆమె నా ముఖంకేసి చూస్తూనే ఉంది కన్నార్పకుండా.

''మీకు కొద్దిరోజులు... అంటే, చాల కొద్ది రోజులు గడువు ఇస్తున్నాను. ఆలోచించుకుని మీ నిర్ణయం నాకు తెలియచెయ్యండి.'' అన్నాను మళ్ళీ నేనే.

ఆమె జవాబు చెప్పలేదు.

''ఏమిటి, ఏమీ మాట్లాడరు?'' అన్నాను.

''ప్లీస్ యూ గెట్ అవుట్'' అంది ఆమె నన్ను అసహ్యించుకుని చూస్తూ.

''వెళతాను కానీ వెళ్ళేముందు ఆఖరి విషయం ఒక్కటి చెపుతాను. నేను మీకు ఒక పద్ధతి సూచించదలచుకున్నాను. ఆదేమిటంటే మీరు, మధు కలసి ఉండండి. నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. ఎటొచ్చి మీ విషయం లోకానికి తెలియ రాదు. ముఖ్యంగా సుజాతకు తెలియకుండా జాగ్రత్తపడాలి మీరు.

అలా మీరు గడపగలిగితే నేను మౌనం వహిస్తాను'' అన్నాను.

''అలా రహస్యంగా బ్రతకాల్సిన ఖర్మ నాకేం పట్టలేదు. ఇక వెళ్ళిరండి'' అంది ఆమె.

ఆమె ముఖంకేసి తీక్షణంగా చూసి ఆమె మొండివైఖరికి మండిపడుతూ లేచి వెలుపలికి నడిచాను.

/ఇంకా వుంది/



(గత సంచిక తరువాయి)

పెద్ద కథ




కంపెనీ ఆవరణలో క్రొత్తగా నిర్మించాలనుకున్న సర్వీసింగ్ పిట్స్ కోసం కాంట్రాక్టర్లు వేసిన టెండర్లను, కంపెనీ వర్క్స్ ఇన్స్‌పెక్టరు ఇచ్చిన ఎస్టిమేట్సునూ పరిశీలిస్తున్నాను.

ఇంతలో స్ప్రింగ్ డోర్సును దఢాలున తోసుకుని ఎవరో గది లోపలికి వచ్చారు. అంత అసభ్యంగా అడవిమనిషిలా లోపలికి వచ్చింది ఎవరా అని విసుగ్గా తల పైకెత్తాను.

ఎదురుగా మధుమూర్తి నిలబడివున్నాడు మహాకోపంగా.

"ఓరి నువ్వట్రా, కూర్చో, కూర్చో" అన్నాను.

మధుమూర్తి కూర్చోలేదు.

"శేఖర్, శ్రీప్రియ ఇంట్లో నీవు అంత అమర్యాదగా ప్రవర్తించడానికీ, మాట్లాడడానికీ కారణం ఏమిటి?" అని అడిగాడు కోపంగానే.

"ఐసీ. నీవు నన్ను సంజాయిషీ అడగడాన్కి వచ్చావన్నమాట. సరే సంజాయిషీ తరువాత ఇస్తాను. ముందు కూర్చో" అన్నాను ఆఫీసు బాయ్‌కి రెండు కూల్‌డ్రింక్స్ తెమ్మని సైగ చేస్తూ.

"నేను కూర్చోవడాన్కి, నిన్ను సంజాయిషీ అడగడాన్కి రాలేదు. మన స్నేహం నాలుగు కాలాలపాటు వుండాలని అనుకుంటే శ్రీప్రియ విషయంలో ఇక జోక్యం కలిగించుకోవద్దని చెప్పి పోవడాన్కి వచ్చాను. నీవు శ్రీప్రియను చంపేస్తానని అన్నావట. శ్రీప్రియను నీవు చంపడమే జరిగితే నిన్ను నేను చిత్రవధ చేస్తాను తెలుసా?" అని అరిచాడు మధుమూర్తి.

స్టెనో హెలన్ తన సీట్లోంచి లేచి వెలుపలికి వెళ్ళిపోయింది మాకు ఏకాంతం ఇవ్వడంకోసం.

నేను నవ్వాను. "నన్ను చిత్రవధ చేసేంత బలం నీకెక్కడుందీ? అయినా ఆమెను చంపేశాక నేను నీ చేతులమధ్య ఎక్కడుంటానూ, హాయిగా పోలీసుల ఆతిథ్యంలో వుంటాను" అన్నాను నవ్వుతూనే.

ఇంతలో బాయ్ కూల్‌డ్రింకులు తీసుకువచ్చి ఒకటి నాముందు వుంచి, మరొకటి మధుమూర్తి చేతికి అందించి వెళ్ళిపోయాడు.

మధుమూర్తి కూల్‌డ్రింక్ గ్లాసును గది మూలకు విసరికొట్టి,

"నీకేమిటి సంబంధం? నా ఆంతరంగిక వ్యవహారాలలో నీవు ఎందుకు తలదూరుస్తావు? అసలు నువ్వెవరు?" అన్నాడు నిప్పులుక్రక్కుతూ.

నేను సావధానంగా కూల్‌డ్రింక్‌ను త్రాగేశాను. మధుమూర్తి తన డ్రింకును గది మూలకు విసిరెయ్యకుండా టేబిల్‌మీద పెట్టేసి వుంటే దాన్నికూడా త్రాగేసి వుండేవాన్ని. అందుకే కాబోలు అన్నారు పెద్దలు 'ధానే ధానే పర్ లిక్కా హువాహై ఖానేవాలేకీ నామ్!' అని.

ఖర్చీపుతో పెదవులు తుడుచుకుని "నేను నీ ప్రాణమిత్రుడ్ని" అన్నాను తాపీగా.

"అయినా ఓ హద్దు అంటూ వుండాలి."

"ఏమిట్రా మరీ పేట్రేగిపోతున్నావు. దేనికి హద్దు కావాల్సినది, స్నేహానికా? ఇడియట్‌లా మాట్లాడక! నీవు ఏ హద్దులు పాటించి బజార్న పడి నాశనం అయిపోతూండిన నన్ను నీ ఇంటికి లాక్కువెళ్ళేవాడివి? ఏ హద్దులు పాటించి పశువులా బ్రతుకుతూండిన నన్ను మనిషిని చేశావు? ఏ హద్దులు పాటించి స్పృహలోలేని నాకు ఎన్నో పర్యాయాలు నీవూ, నీ భార్యా ఉపచారాలు చేశారు? ఏ హద్దులు పాటించి నీ భార్య నాకు కన్నతల్లిలా, స్వంత సోదరిలా

...న్నం తినిపించి ఆదుకుంది...? చెప్పరా వెధవా" అన్నాను నేను కొద్దిగా కోపం తెచ్చుకుని.

"అదంతా నీమీద జాలితో చేశాను నేను."

"నేనూ ఆ జాలితోనే నిన్ను సరయిన దారిలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నాను."

"కానీ నాకు ఇష్టమయిన ఆనందాన్ని నన్ను అనుభవించకుండా అడ్డు తగులుతున్నావు."

"ఏడిచావు. మనం మనుషులం పశువులం కాము. మనకు సమాజం, సంస్కృతి, సంస్కారం మొదలైనవి వున్నాయి. ఇష్టం వచ్చిందని యెవరినో అడిషనల్‌గా కట్టుకునేయడం, కట్టుకున్న అసలు భార్యకు ద్రోహం చెయ్యడం వగైరాలు చెయ్యడానికి మనం అనాగరిక మానవులం కాము."

"నా యిష్టం వచ్చినట్లు చేస్తాను. అడ్డు వచ్చిన వాళ్ళందరినీ నేనూ ఏమైనా చెయ్యడానికి వెనుకాడను జాగ్రత్త!" అని అరుస్తూ గదిలోంచి సుడిగాలిలా వెలుపలికి వెళ్ళిపోయాడు మధుమూర్తి.

అరనిముషం ఆలోచించి నేనూ నా సీట్లోంచి చప్పున లేచాను నా కారు తాళాలు అందుకుని. గబగబా నడచి అంబాసిడర్ కార్లో కూర్చున్నాను.

కారుని వేగంగా నడిపి రెండు మూడు నిముషాలలోనే మధుమూర్తి స్కూటర్‌ను

# తెగిపోయిన గాలిపటాలు

ఓవర్‌టేక్ చేసి అతని దారికి అడ్డుగా నా కారు ఆపి కారు దిగాను.

"ఒరేయి ఒక పని చెయ్యరా" అన్నాను.

"ఏమిటి?" అన్నాడు మధుమూర్తి ముఖం అంతా చిట్లించి.

—"నీ జీవితంలో మరో స్త్రీ భాగస్వామి కావడం సుజాత భరించలేదు. నీవేమో శ్రీప్రియను వదలలేనంటున్నావు అందువల్ల నేను ఒక విధానం చెపుతాను. అలా చెయ్యడం అందరికీ శ్రేయస్కరం కావచ్చు.

శ్రీప్రియను దూరంగా ఉన్న ఏదయినా మరో ఊరిలో ఉంచెయ్యి ఆమెను వదులుకున్నట్లు సుజాతను నమ్మించు. నేనుకూడా సుజాతను నమ్మిస్తాను... ఆత్మద్రోహం చేసుకుని... నీవు బుద్ధిమంతుడు అయ్యావని అప్పుడప్పుడు నీవు బిజినెస్ క్యాంపులు వెళ్ళినట్లు వెళ్ళి శ్రీప్రియను కలుసుకుంటూ ఉండు." అని వివరించాను ఓపికగా

"అలా దొంగబ్రతుకు బ్రతకాల్సిన అవసరం నాకు లేదు." అన్నాడు మధుమూర్తి ఖచ్చితంగా

"కానీ ఎంగిలి బ్రతుకును అనుభవించే మనిషి కాదు సుజాత. ఆమె ఏదయినా అఘాయిత్యం చేస్తే?" అని అడిగాను.

"వచ్చేవాళ్ళను ఎవరాపగలరు?" తన స్కూటర్‌ను కిక్ చేసి స్టార్టు చేసుకుంటూ అన్నాడు మధుమూర్తి.

చాచి చెంపకాయ కొట్టాలనిపించింది. కానీ ఓపిక తెచ్చుకుని ఉద్రేకాన్ని తగ్గించుకుని,

"చంపేవాళ్ళని కూడా ఎవరూ ఆపలేక పోవచ్చు బహుశా." అంటూ వెళ్ళి నా కార్లో కూర్చున్నాను.

మధుమూర్తి స్కూటర్ బజాజ్‌చేతక్ దూసుకుపోయింది నా ప్రక్కనుండి

* * *

రోజులు గడచిపోతున్నాయి.

ప్రతిరోజూ మధుమూర్తి ఇంటికి వెళ్ళి సుజాతకు స్వాంతన వచనాలూ, ధైర్య వచనాలూ చెప్పి వస్తున్నాను. కానీ అవి ఆమెకు ఊరట కల్గించడంలేదు

ఈ ఆడవారు మరీ సున్నిత హృదయులు. వీరు కొన్ని విషయాలను మాత్రం ఏమాత్రమూ సహించరు.

ఒక్కటి మాత్రం నిజం అని నేను నిర్ణయించుకునేశాను. ఇంకో నెల రోజులలోగ మధు శ్రీప్రియను వదులుకోలేకపోతే సుజాత ఆత్మహత్య చేసుకోవడం మాత్రం ఖాయం



## బొమ్మల కొలువు

ఆం.ప్ర. "క్రోక్విల్‌క్లబ్" ఆధ్వర్యాన ఫిబ్రవరి 3న, హైదరాబాద్‌లో—ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ శివలెంక రాధాకృష్ణగారి అధ్యక్షతన శ్రీ బాపూగారి 'బొమ్మలకొలువు' పుస్తకావిష్కరణ సభ, చిత్రప్రదర్శన ప్రారంభోత్సవం ఘనంగా జరిగాయి. మొదటి చిత్రంలో బొమ్మల కొలువు నావిష్కరిస్తున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు, ప్రక్కన సభాధ్యక్షులు శ్రీ రాధాకృష్ణగారు, రెండో చిత్రంలో శ్రీ అక్కినేని, ఎడమ ప్రక్కన శ్రీ శంకుగారు, కుడివైపున శ్రీ సి. నా. రె. గారు, ఆ ప్రక్కన శ్రీ సత్యమూర్తిగారు వున్నారు.



అటువంటి పరిస్థితి దగ్గరకు వస్తే నేనేం చెయ్యాలి ? అనేదే నాకు అంతుపట్టడంలేదు.

భయపెట్టడానిక్కానీ, ఉద్రేకంతో కానీ ఆనాడు శ్రీప్రియను 'చంపేస్తాను' అని అన్న మాటను నిజం చేస్తే తప్ప ఈ సమస్య విడిపోయేలా లేదు.

కానీ నా జీవితం ? ఇప్పుడిప్పుడే నా చీకటి జీవితంలోకి వెన్నెల వెలుగులా చొచ్చుకురావడానిక్కి ప్రయత్నిస్తున్న అమాయకురాలు, ఈ ప్రపంచంలో ఒక అభాగ్యురాలు అయిన చంద్రిక జీవితం ?

నా ఇంటికి నాలుగు ఇండ్ల అవతల ఉన్న ఓ చిన్న పెంకుటింటిలో ఉన్న పరంధామయ్య మేష్టారిగారి అమ్మాయి చంద్రిక. ఆయనకు ఆమె, ఆమెకు ఆయనా తప్ప ఈ ప్రపంచంలో వారికి మరెవరూ లేరు.

ఏదో స్కూలులో టీచరుగా పనిచేస్తూ వృద్ధాప్యంలో మంచానపడివున్న తన తండ్రిని ఆమె పోషించుకుంటూ ఉంది.

వెయ్యి మాటలతో తెలియచెప్పలేనటువంటి విషయాన్ని ఒక్క చూపుతో చెప్పవచ్చు. చూపులకు ఉన్న శక్తి, కళ్ళకున్న నేర్పూ ఈ ప్రపంచంలో మరిదేనికీలేదు. అందువలననే నాకూ చంద్రికకూ మధ్య సుఖపరిచయం మాత్రమే ఉన్నా ఆమె నన్ను ప్రేమిస్తోందని నేను గ్రహించగలిగాను. నా స్టేటస్ చూసి ఆమె ఆ విషయాన్ని తన హృదయంలోనే దాచేసుకుందని కూడా నేను తెలుసుకోగలిగాను. కానీ ప్రేమించగల హృదయాల తాలూకు ఆకర్షణ ఎటువంటి పరిస్థితులలోనూ దాగదని ఆమెకు తెలియదు.

నన్ను గూర్చి చంద్రికకు ఎంత తెలుసునో, ఎంత తెలియదో నాకు తెలియదు. కానీ చంద్రికను గూర్చిన ప్రతి విషయం నాకు తెలుసు ఆమె వ్యక్తిత్వం, ఆమె సంస్కారం నాకు నచ్చాయి. ఆమెను నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను ఇప్పుడు. నేను పెళ్ళి చేసుకుంటే ఆమె జీవితం ప్రశాంతంగా నడచిపోతుంది. నా జీవితానికీ ఒక అర్థం కనిపిస్తుంది.

సుజాత కాపురం బాగవడం కోసం శ్రీప్రియను హత్యచేసి జైలుకు వెళ్ళాలా ? ఎంతో కష్టపడి సంపాదించుకున్న నా ఈ పొజిషన్ అంతా వదులుకోవాలా ? ? లేక చంద్రిక ప్రేమను అందుకుని ఆమెతో జీవితాంతం ఆనందంలో తేలిపోవాలా ? నేనేది చెయ్యాలి ?

చాలా చెడ్డ రోజులలో నాకు అన్నం పెట్టిన సుజాత చేతులు ఒకవైపు, ప్రేమతో చేతులు చాస్తున్న చంద్రిక చేతులు మరోవైపు నన్ను విపరీతమైన సంఘర్షణకు లోను చేస్తున్నాయి. ఈ సంఘర్షణలోనే రోజులు గడచిపోతున్నాయి.

* * *

ఉదయం ఎనిమిది గంటలైంది.

నిన్న మధ్యాహ్నం సుజాత అన్న మాటలు నా చెవులలో గింగురుమంటున్నాయి.

"అన్నయ్యా, రేపు ఆఖరి పర్యాయం ఆయనను అడగదలచుకున్నాను. ఆయన నా మాట వినని పక్షంలో రేపే నా జీవితానికి ఆఖరి రోజు... పిల్లల్ని మీరు మా అన్నయ్య వద్దకు..."

## తెగిపోయిన గాలిపటాలు

రాత్రంతా నిద్ర లేనందువల్ల నా కండ్లు మండుతున్నాయి.

చివరికి నా ఆలోచనలు తెగిపోయి ఒక నిశ్చయం ఏర్పడింది నా మనసులో. ఇక ఆలోచించి ప్రయోజనంలేదు అని అనుకుంటూ లేచి డ్రెస్ వేసుకున్నాను.

మధు ఏం జవాబిస్తాడో నాకు తెలుసు.

సుజాత చేతులు గెలిచాయి నా మనసులో.

బీరువాలోంచీ విస్కీ బాటిలు తీసి రెండు పెగ్గులు గబగబా త్రాగేశాను గ్లాసులో పోసుకుని

డ్రింక్ అలా బాటం సిప్‌గా తీసుకోవడంవల్ల తలనొప్పి తగ్గిపోయి ఉత్సాహం వచ్చేసింది క్షణాల మీద.

మరో చిన్న సైజు బాటిల్‌లో విస్కీ నింపుకుని జేబులో వుంచుకుని బయల్దేరాను.

అంబాసిడర్‌లో కూర్చుని తలుపు మూశాను

## క్రొత్తగాలి

కిటికి రెక్కల్ని తెరువ్—
గదిలోకి క్రొత్త గాలి వీస్తుంది
పీల్చి వదిలిన గాలిని
మళ్ళీ మళ్ళీ పీల్చుకొని
ఇంతవరకు ఏ విధంగానో బ్రతికినావ్

కానీ— అది ఇప్పుడు విషగాలి సుమా !
సులువుగా ప్రాణాల్ని తినేస్తుంది.
సువాసనల్తో దుర్గంధాన్ని కప్పిపుచ్చలేవ్

అందుకే— త్వరగా కిటికి రెక్కల్ని తెరువ్—
క్రొత్త గాలితోపాటు
క్రొత్త వెల్తురు అడుగువెడుతుంది గదిలోకి—

గదిలోంచి పాత గాలితో
పాత చీకట్లు కూడా పారిపోతాయ్ !

— మహమూద్ పాషా

హఠాత్తుగా నా కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

కారు స్టార్టుచేసి బాణంలా దూకించి చంద్రిక ఇంటి ముందు బ్రేకువేసి ఆపి హారను వాయించాను.

స్కూలుకు వెళ్ళడానిక్కి తయారవుతోంది కాబోలు రెండు చేతులతో మొహానికి పౌడరు రాసుకుంటూ అలాగే గుమ్మంలోకి వచ్చి తొంగిచూసింది చంద్రిక.

ఆమెన్ను దగ్గరగా రమ్మని సైగచేస్తూ చెయ్యి ఊపాను.

ఆమె ఖంగారుగా, ఒకరకం ఆనందంగా, నెమ్మదిగా నడచివచ్చింది నా కారు దగ్గరగా.

ఆలోగా క్లచ్చి నొక్కి ఫస్ట్ గేర్ వేసుకున్నాను.

"చంద్రికా నన్ను క్షమించు ... గుడ్‌బై"

అంటూ ఆక్సిలేటరును త్రొక్కి క్లచ్చి వదిలాను. కారు ఒక్క జర్కులో ముందుకు సాగింది తెల్లబోతున్న చంద్రికను వదులుకుని.

ఎడంచేత్తోనే స్టీరింగ్ త్రిప్పుతూ, గేర్లు మారుస్తూ కుడిచేత్తో కన్నీరు తుడుచుకుంటూ 'చంద్రిక'తో నేను మాట్లాడిన మొదటిమాటా, ఆఖరిమాటా ఇదే కావచ్చు నా జీవితంలో అనుకున్నాను.

* * *

శ్రీప్రియ ఇల్లు తాళంపెట్టి వుంది.

చేతిగడియారం చూసుకున్నాను విసుగ్గా. ఎనిమిదీ ముప్పయి దాటుతోంది. నేను ఆలస్యాన్ని కాస్త సహించలేకుండా వున్నాను. ఆలస్యం అయేకొద్దీ నాలో శ్రీప్రియను చంపివేయగల స్థైర్యం, ఆత్మధైర్యం తగ్గిపోవచ్చు.

'కొంపదీసి ఆఫీసుగ్గానీ వెళ్ళిపోయిందా ?' అనుకుని మొదట భయపడ్డాను. కానీ ఆమె ఆమధ్య ఉద్యోగం మానేసిన విషయం జ్ఞాపకానికి వచ్చి, కొద్దిదూరంలో వున్న ఓ చెట్టు క్రింద కారు ఆపి నడచివచ్చి శ్రీప్రియ ఇంటి వరండాలో ప్రవేశించాను.

రెడ్‌విల్స్ సిగరెట్ వెలిగించుకుని వరండాలో అటూ ఇటూ పచార్లు చేస్తున్న నాకు కిటికీ దగ్గర ఓ మడుకు లాంటి ప్రదేశం కన్పించింది. 'సహజంగా ఇంట్లోంచి వెళ్ళేప్పుడు తాళంచెవులు అలాంటిచోట పెట్టి వెళ్ళే అలవాటు చాలమందికి వుంటుంది' అనుకుంటూ అప్రయత్నంగా ఆ మడుకులో చెయ్యిపెట్టి వెదికాను. నా ఊహ కరక్టు. అందులో తాళంచెవులు వున్నాయి.

అందుకుని తాళంతీసి ఇంట్లో ప్రవేశించాను. నిస్సంకోచంగా వంటగదిలోకి వెళ్ళి ఒక గాజు గ్లాసు, జగ్గులో నీళ్ళు, కొన్ని బిస్కట్లూ పట్టుకుని హాల్లోకి వచ్చాను. కిటికీలన్నీ మూసి లైట్లు వెలిగించాను.

తరువాత నేను తెచ్చుకున్న విస్కీని కొద్దికొద్దిగా గ్లాసులో పోసుకుని నీళ్ళు కలుపుకుని త్రాగుతూ బిస్కట్లు తింటూ కూర్చున్నా.

నిముష నిముషానికీ నాలో సహనం తగ్గిపోతోంది. శ్రీప్రియ 'ఎంతకూ రాదేం ?' అనుకున్నాను.

సమయం ఎవరికోసమూ, ఎందుకోసమూ, ఎటువంటి పరిస్థితులలోనూ ఆగదు. నా వాచీలోని సెంటర్ సెకండ్ పరుగులుతీస్తోంది. నిముషాల ముల్లు కదులుతోంది నెమ్మదిగా.

* * *

పదిగంటలు దాటుతోండగా శ్రీప్రియ వచ్చింది యింట్లోకి.

"ఓ, మై సుధూ ! ఏమిటింత తెల్లవారే మళ్ళీ వచ్చేశావు? ఐయాం వెరీ హేపీ" అంటూ.

గ్లాసులో మిగిలివున్న విస్కీని గొంతుకలో పోసుకుని ఠీవిగా లేచి నిలబడ్డాను.

"మీ...మీ...రా ?" అంది ఆమె.

"అవును నేనే" అన్నాను. నా కంఠస్వరం నాకే క్రొత్తగా విన్పించింది.

"ఎందుకు వచ్చారు ?" అని అడిగింది ఆమె చేతిలోని కాయగూరల ప్లాస్టిక్ బుట్టను ప్రక్కనే వున్న బల్లమీద వుంచుతూ.

"నిన్ను చంపెయ్యడానిక్కి" అన్నాను. నా రక్తం ఉరకలువేస్తోంది. నా బుర్రమీద విస్కీ

ప్రభావం తాలూకు వేడి కూడా [illegible] చేస్తోంది

''ఉండ పదలచుకున్న వాళ్ళను ఒద్దని నెట్టుకోవడం అవివేకం అనుకుంటాను'' అంటూ హాలు మూలకు వెళ్ళి చెప్పుల షెల్ఫు దగ్గర చెప్పులు వదిలి ఇవతలకి వచ్చింది ఆమె.

ఈమె ఒక ప్రత్యేకమైన మనసు కలిగిన స్త్రీ. దాపంటే సర్వసాధారణ విషయంగా భావిస్తోంది.

## తెగిపోయిన గాలిపటాలు

రెండంగల్లో వెళ్ళి ఆమెను సమీపించి రెండు చేతులతో ఆమె సున్నటి మెడను పట్టుకున్నాను.

నా కళ్ళల్లోకి చూస్తోంది ఆమె నిర్వికారంగా. ఆమె కళ్ళలో నదురూ బెదురూ లేదు.

''నేను మీకు ఎలాంటి అపకారమూ చెయ్యలేదు. నన్ను చంపి మీరేదో బావుకోవాలని అనుకుంటే భగవంతుడు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించడు'' అంది ఆమె

నా మనసులో మళ్ళీ సంఘర్షణ మొదలయింది. శ్రీప్రియను హత్యచెయ్యడం ధర్మం కాదేమో ? అని కానీ మరుక్షణం తల విదిలించాను. కొన్ని విషయాలలో కఠినత్వం వహించి అధర్మంగా ప్రవర్తించక తప్పదు అనుకున్నాను. అదే క్షణాలలో నా చేతులు




గవర్నమెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి నాణ్యమైన ఉత్పాదన. మార్కెట్ చేయువారు: మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు

బిగుసుకున్నాయి. నా బొటనవ్రేళ్ళు ఆమె పీకను కసిగా నొక్కేశాయి. రెండే రెండు నిముషాలలో ఆమె ప్రాణం గాలిలో కలిసిపోయింది.

అందమైన శ్రీప్రియ ముఖం ఇప్పుడు వెళ్ళుకువచ్చిన కనుగ్రుడ్లు, నాలికలతో భయంకరంగా వుంది. కోమలమైన, అందమైన ఆమె శరీరం ప్రేతకళతో తివాచీ మీద నిర్జీవంగా పడి వుంది.

కొద్ది క్షణాలు నాకు ఏదో మైకం కమ్మినట్లయింది. అయిపోయింది ... నా జీవితం ఇక యెంత భయంకరంగా వుంటుందో ఏమో? ఈ నిముషం నుండీ నేను ఒక హంతకుడ్ని.

శ్రీప్రియ నిర్జీవ ప్రతిమను చూస్తూంటే యెందుకో విపరీతమైన దుఃఖం, పశ్చాత్తాపం పుట్టుకువస్తున్నాయి నాలో.

మొహాన్ని చేతులతో కప్పుకుని ఐదు నిముషాల పాటు కరువుతీరా ఏడ్చేశాను.

"శ్రీప్రియా నన్ను క్షమించండి! నన్ను క్షమించండి; వచ్చే జన్మ అంటూ ఉంటే నేను చచ్చిపోయాక వచ్చే జన్మలో మీ తమ్ముడుగానో, మీ కొడుకుగానో పుడతాను" అంటూ శ్రీప్రియ పాదాలు పట్టుకుని కళ్ళకద్దుకున్నాను పదే పదే

టయిం చూసుకుని ఉలిక్కిపడ్డాను. వెంటనే వెళ్ళి సుజాతకు ధైర్యం చెప్పాలి. "మీరు ఇకపై హాయిగా ఉండవచ్చు." అని సుజాతకు చెప్పాలి మొదట అనుకుంటూ బయల్దేరాను.

రోడ్లమీద ఉన్న మనుషులను భయభ్రాంతులను చేస్తూ డెబ్బయి - డెబ్బయి కిలోమీటర్ల మధ్య వేగంతో నా కారు మధుమూర్తి ఇంటివైపు దూసుకువెళ్ళింది.

నేను కారు దిగి తలుపు మూసి రెడ్‌విల్స్ నోట్లో పెట్టుకుని సిగార్ లైటర్ కోసం పాకెట్లలో వెతుకుతున్నాను. ఇంతలో మధుమూర్తి పిల్లలు ముగ్గురూ పరిగెత్తుకువచ్చారు.

"బాబాయ్. బాబాయ్! ఉదయం నాన్నారు అమ్మను కేకలేసి వెళ్ళిపోయారు బాబాయ్. అమ్మ ఏమో దేవుడి గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. ఎంత పిలిచినా తలుపులు తీయడంలేదు" అని కలగా పులగంగా చెప్పసాగారు.

అదిరిపోయాను. కొంపదీసి నేను ఆలస్యం చేశానా? అని అన్పించింది. నా మెడమీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి. సిక్స్త్ సెన్సు ఏదో హెచ్చరిక చేస్తోంది.

పరుగుతీశాను ఇంట్లోకి.

"ముందు తలుపు తీయండి. నేను అన్నీ సరిజేసి వచ్చేశాను. ఇక మధుమూర్తి, మీరూ హాయిగా ఉండవచ్చు." అని అరుస్తూ తలుపులు బాదసాగాను.

ఐదు నిముషాలు గడచినా తలుపులు తెరవబడలేదు.

పనిమనిషి, ప్రక్క ఇంట్లో ఉండే ముసలాయనా వచ్చి చేరారు నా దగ్గరకు. పిల్లలు బిక్కమొహాలు వేసుకుని చూస్తున్నారు.

బూటు కాళ్ళతో పిచ్చిపిచ్చిగా తన్ని తన్ని తలుపులు విరగ్గొట్టి తెరిచాను.

అవతలి దృశ్యం చూడగానే నా మెదడులో బాంబులు బ్రద్దలయ్యాయి. నా గుండెల్లో రైలు ఇంజన్లు ఢీకొన్నాయి. కండ్లు చీకట్లు కమ్మాయి.

పై కప్పులో సీలింగ్ ఫాన్ బిగించుకోవడానికి వేసి ఉంచిన 'యూ' క్లాంపుకు కట్టిన త్రాటికి వ్రేలాడుతూ ఉంది సుజాత శవం భయంకరంగా. ఆమె నాలికా, కనుగ్రుడ్లూ వెళ్లుకువచ్చాయి. నాకు అన్నం పెట్టిన ఆ సుకుమారమైన చేతులు వాడిపోయిన తోటకూర కాడల్లా వ్రేలాడుతున్నాయి నిస్సారంగా.

"భగవంతుడు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించడు." శ్రీప్రియ కంఠస్వరం నా చెవులలో ప్రతిధ్వనిస్తోంది.

భయంతో వణికిపోతున్న పిల్లల్ని ప్రక్కింటి ముసలాయనా, పనిమనిషీ అవతలికి లాక్కుపోయారు.

నేను గదిలోకి అడుగుపెట్టాను. ప్రక్కనే గూట్లో కాగితం రెపరెపలాడుతోంది. అందులో ఇలా వుంది.

నా మరణానికి ఎవరూ కారకులు కారు. చాలకాలంగా వున్న భరింపరాని కడుపునొప్పి మందులకు లొంగకపోవడం వలన ఆత్మహత్య చేసుకుంటున్నాను.

— సుజాతాదేవి.

"మీ కాపురం బాగవడంకోసం నేను నా జీవితాన్నే సర్వనాశనం చేసుకున్నాను. అయితే కొద్దిపాటి ఆలస్యానికి మీరెంత శిక్ష విధించారు? యెంత పని చేశారు?!" అని అడిగాను ఆమె శవాన్ని కన్నీటితో.

శవాలు యెక్కడ జవాబులు చెప్పగలవు?

నాకు కర్తవ్యం గుర్తుకువచ్చింది. సుజాత శవాన్ని ఆఖరిసారిగా చూసి, కన్నీరు తుడుచుకుని గుండెదిటవు చేసుకో ప్రయత్నిస్తూ బయల్దేరాను.

ప్రక్క ఇంట్లోంచి పోలీసులకు ఫోన్ చేసి సుజాత ఆత్మహత్య విషయమూ, శ్రీప్రియ హత్య విషయమూ తెలియచేసి, "శ్రీప్రియ హంతకుడు మరో అర్ధగంటలో మీకు లొంగిపోతాడు" అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

మైసైన్ కాల్ బుక్‌చేసి సుజాత అన్నను పిలిపించమని ప్రక్కింటి ముసలాయనకు చెప్పి అతని చేతికి రెండువందల రూపాయలు ఇచ్చాను. సుజాత అన్నగారి అడ్రసు ఆయనకు ఇచ్చి, గుండెలవిసేలా ఏడుస్తున్న మధుమూర్తి పిల్లల్ని సముదాయించి ఆఖరిసారి ముద్దుపెట్టుకుని, వెళ్ళి కార్లో కూర్చున్నాను.

అతివేగంగా కారును నడిపి నాలుగు నిముషాలలో విజయభారత్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ చేరుకున్నాను.

కారు తాళపుచెవులూ, నా రాజీనామా ఉత్తరమూ నా అసిస్టెంటు రాంసింగ్ చేతికి అందించి ప్రొప్రయిటరుకు ఫోనుచేసి చెప్పాను నేను రిజైన్ చేస్తున్నట్లు.

"నో ... మీరు రిజైన్ చెయ్యడానికి వీలులేదు. మీలాంటి సిన్సియర్ అండ్ హానెస్ట్ మేనేజరు మాకు వెంటనే దొరక్కపోవచ్చు. మీ రిజిగ్నేషను నేను కాన్సిల్ చేస్తున్నాను" అన్నాడు ఆయన.

నేను నవ్వాను.

"క్షమించాలి సార్. మీలాంటి సహృదయుల వద్ద పని చేసే అదృష్టం నాకు లేదు. ఇంకో గంట సమయం గడచిపోతే మీరే నన్ను రిజైన్ చెయ్యమని చెప్పవచ్చు. నా పరిస్థితులు అలాంటివి. అందుకే నేనే రిజైన్ చేస్తున్నాను ... ఎప్పటికీ మీ దృష్టిలో హానెస్ట్‌గా వుండిపోవాలనే ఆశతో!" అన్నాను.

"ఓ గాడ్. అంతటి విషమ పరిస్థితులలో వున్నారా? నావలన ఎలాంటి సహాయం కావాల్సి వచ్చినా తీసుకోండి. తప్పక చేస్తాను. సాయంకాలము గ్రాండుగా ఫేర్‌వెల్ పార్టీ అరేంజ్ చేస్తాను. అప్పుడు మీ రిజైన్..." అంటూ ఇంకా ఏదో అంటున్నారు ఆయన.

"థ్యాంక్యూ ఫర్ యువర్ ఎఫెక్షన్ సర్! నేను దేన్నీ అందుకునే పరిస్థితులలో లేను. ఐయాం వెరీసారీ." అంటూ ఫోన్ పెట్టేసి కన్నీరు తుడుచుకున్నాను.

ఎంతో ఆనందాన్నీ, ప్రశాంతినీ, గౌరవాన్నీ, హోదానూ ఇచ్చిన ఈ కంపెనీతో నాకు ఋణం తీరిపోయింది.

అసలు ఈ ఊరితో, ఈ లోకంతో కూడా ఋణం తీరిపోవచ్చు నాకు యావజ్జీవ కారాగార శిక్షగానీ, ఉరిశిక్షగానీ పడితే.

బొమ్మల్లా నిలబడి విచిత్రంగా నన్నే చూస్తున్న ఆఫీస్ స్టాఫ్ కందరికీ గుడ్‌బై చెప్పి నా స్వంత మోటారు సైకిలు ఎక్కాను.

క్రమంగా పోలీసు స్టేషనువైపు సాగిపోతున్న నాకు మధుమూర్తి ఎదురయ్యాడు తన స్కూటరు మీద. అతన్ని చూడగానే నేను మోటారుబైకును ఆపాను. అతనూ నా దగ్గరగా వచ్చి ఆగాడు.

"శేఖర్, చివరికి ఓ నిర్ణయానికి వచ్చాను ఈ అశాంతినీ, ఈ సంఘర్షణనూ భరించలేక. నీవే గెలిచావురా మొత్తానికి. శ్రీప్రియ జీవితానికి ఏదయినా ఒక దారిని చూపించి ఆమెను వదులుకో దలచుకున్నాను. ఈ విషయం చెప్పడానికే సుజాత దగ్గరకు, ఇంటికి వెళ్తున్నాను" అన్నాడు.

నవ్వాలో ఏడవాలో తెలియని పరిస్థితి అంటే ఇదే కాబోలు అన్పించింది.

బ్రేకుమీద ఉన్న కుడికాలును నేలమీద ఉంచి ఎడం కాలితో ఫస్టుగేరు వేసుకున్నాను.

"మధూ! పిల్లల్ని నీ కంటి పాపలుగా చూసుకో, గుడ్‌బై" అంటూ కుడిచేత్తో ఆక్సిలేటర్ని త్రిప్పి, ఎడంచేత్తో క్లచ్చి విడరుమ వదిలాను.

"శేఖర్, శేఖర్" అని అరుస్తున్న మధుమూర్తిని దాటుకుని వేగంగా పరుగులు తీసింది జావా పోలీస్‌స్టేషనుకేసి.

నాకు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మాత్రమే పడుతుందనీ, శిక్ష అనుభవించడానికి వెళ్లే నన్ను చంద్రిక కలుసుకుని "మీకోసం, ఎన్ని సంవత్సరాలయినా, ఎంత కాలమైనా ఎదురు చూస్తాను." అని నాతో చెపుతుందనీ అప్పట్లో నాకు తెలియదు.

**(అయిపోయింది)**